# 41. మహాకవుల సరసం

"మా ప్రపంచ తెలుగు మహాసభలను గురించి మీ 'కబుర్లు'లో ఇంతవరకూ ఏకరనందుకు కృతజ్ఞులము. మీ 'కబుర్లు' తెలుగు సాహితీయోషకు భూషణములు. 'కబుర్లు'లో కాలువలై ప్రవహించెడి హాస్య, వ్యంగ్య రసములకు భయపడి గాక, ముగ్ధులమై తమకు ఈ యుగాది నాడు మరో నూట ముప్పదిమంది ఘనా ఘన ఘనా పాఠీలతోపాటు సన్మానము చేయ తలపెట్టితిమి. తమరా రోజున తప్పక సభకు విచ్చేసి మేమిచ్చు చందన, తాంబూల, శాలువాది సత్కారా లందుకో ప్రార్థన" అని రాశారు తెలుగు పెద్దలు సవినయంగా ఇంగ్లీషులో ఓ ఉత్తరం.

ఈ ప్రపంచ తెలుగు సన్మానాల్లో శాలువా తప్ప మరేం ముట్టదని తెలిసి "అయ్యా! నే నింకనూ బాలుడను. డాక్టరుగారి సలహాపై కాఫీ, టీరు మానివేసి పాలు, పెరుగు మాత్రం పుచ్చుకుంటున్న పసివాడను. మీ సన్మానం మరో పదేళ్ళకు వాయిదా వేయ ప్రార్థన. మీరివ్వదలచిన శాలువా మాత్రం పోస్టులో పంపగలరు. వచ్చే చలి కాలంలో మా బుడ్డోడికి కప్పుకునేందుకు అది పనికి రాగలదు" అని మర్యాదగా జవాబు రాసేను.

అయినా ఘనమైన ఏలినవార్లూ, వారి సాహిత్య సలహాదార్లూ నా హాస్యాన్ని, వ్యంగ్యాన్ని గుర్తించేరు గదా! అని లోలోపలే ఆనందించకపోలేదు. అయితే, ఆ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. మహా కవుల్లోనే నాకు పోటీదార్లు ఎదురయ్యేరు. వారి హాస్యరచనలు పోటా పోటీలుగా ఈ మధ్య దినపత్రికల ముఖంగా స్టేట్ మెంట్ల రూపంలో వెలువడి లక్షలాది తెలుగువారిని అలరించేయి.

ఈ మహామహుల్లో ఒకరు కవిసామ్రాట్, కళాప్రపూర్ణ వగైరా బిరుదులున్న విశ్వనాథ సత్యనారాయణ. వీరు చాలా ఏనుగుల్నెక్కిన మహాకవి. మడికట్టుకుని మాత్రమే కవిత్వం రాసే ఆస్థానకవి. ఆ మధ్య కాశీలో జరిగిన సాహిత్య రేసుల్లో లక్షరూపాయల జాక్ పాట్ కొట్టేసిన అదృష్టవంతుడు.

మరో మహా పురుషుడు శ్రీశ్రీ. ఈయనకూడా మడి కట్టుకునే కాగితం, కలం పుచ్చుకుంటారని విశ్వనాథవారు శెలవిస్తున్నారు. అయితే, శ్రీశ్రీగారు గంగా జలంతోనో, బెజవాడ బందరు కాల్వ నీళ్ళతోనో గాక మ్లేచ్ఛులనుండి వచ్చిన విస్కీ బాటిల్ లోని తుచ్ఛజలంతో మడి పాటిస్తారట.

శ్రీశ్రీ గారు కూడా ఈ మధ్య ఢిల్లీలో జరిగిన స్మాల్ స్కేల్ సాహిత్య రేసుల్లో ఓ అయిదువేల రూపాయల జాక్ పాట్ కొట్టేసిన ఘనులే

తామిద్దరం గురుశిష్యులం అని వీరిద్దరూ లోగడ పర

స్వరం సర్టిఫికేట్లిచ్చుకుని ఉన్నారు. "అల్లసాని పెద్దనగారికి తెనాలి రామలింగడిమీద ఉండే ప్రేమలాంటిది విశ్వనాథ వారికి తనమీదా ఉందని శ్రీశ్రీ లోగడ ఓ సర్టిఫికేటు రాసుకుని విశ్వనాథవారిచేత సంతకం చేయించుకున్నాడు కూడా. కాదన్నవారు లేరు. ఇంతకీ అల్లసాని వారికి రామలింగడి మీద ఉన్న ప్రేమ ఎలాంటిది ?

ఓరోజు పెద్దనగారు భుక్తాయాసంతో తూగుటుయ్యాల మీద చేరబడి, ఖాతా దుకాణం నుంచీ చాకలోడు తెచ్చిన "స్పెషల్ కలకత్తా బంగ్లా పాన్" నములుతూ ఆలోచిస్తున్నారట.

ఇంట్లో వెచ్చాలు అయిపోయాయి. రాయల వారికి దురద పుట్టించు మహాప్రబంధం మరొకటి రాసి బియ్యం, పప్పులు, కట్టెలు తెచ్చుకోకపోతే రోజులు గడిచేటట్టు లేవే! ఏం రాద్దాం! ఎంత శృంగారం గుప్పిద్దాం!"అని ఆలోచిస్తూండగా...!

అమెరికన్ సిన్మాల్లో సూపర్ మాన్ లాగా అక్కడ ఊడిపడ్డాట్ట తెనాలి రామలింగడు. "ఏమి తాతా! ఊరక కూకుంటిరి ! ఊతునా ?" అని పరామర్శించేట్ట !

సరే! పీళ్ళ విప్లవం ఏమిటో కూడా చూద్దాం! పోయిందేముంది !" అనుకుని విరసం అధ్యక్షుడయిపోయిన శ్రీశ్రీ లాగా పెద్దనగారు "సరే! పనివాడెలాగూ లేడు!

పీడిచేత కాసేపు ఊపించుకుందాం" అనుకుని ! "ఓ ! యస్ ! రామలింగా, యువార్ ఎ గుడ్ బోయ్! యు మే స్టార్ట్!" అని శలవిచ్చేరుట. రామలింగడు మరుక్షణం నోట్లో నాను తున్న కారాకిళ్ళీ రసం కాస్తా తుపుక్కున పెద్దనగారి మీదికి ఊసేశాడుట.

ఈ మోటు సరసానికి ఉగ్రులైపోయిన ప్రబంధ సామ్రాట్టు తక్షణం కాలినున్న పాంకోడు విసరగా అది తగిలి రామలింగడి ముందు పళ్లు మూడూ అక్కడికక్కడే రాలి పడ్డాయట.

అదీ వారి గురుశిష్య సంబంధం. అదీ వారి సరస శృంగారం.

వారి వారసులం అని తమకు తామే సర్టిఫికేట్లిచ్చు కున్న మన మహాకవుల స్టేట్మెంట్ల సరసం కూడా ఆ స్థాయి లోనే ఉందనిపిస్తోంది.

"మనవాళ్లుత్త వెధవాయలోయ్ !" అని ఏనాడో అన్నాడు గిరీశం.

విశ్వనాధవారు ఈ కాలపు అపురూప వ్యక్తి. మంత్రిం చిన దర్భల్ని గాలిలోకి వదలితే అవే విప్లవాన్ని తెస్తాయని వారి ప్రగాఢ విశ్వాసం. విప్లవం అంటే జంధ్యాన్ని రోజూ ఉతికి పెట్టుకోవటం, తెల్లారకముందే లేచి సచేల స్నానం చేసి

పంచముల కంటపడకుండా గుళ్ళోకి దూరి తెల్లారేదాకా జపం చేయటం, శూద్రుల్ని ఉప్పు పాతరవేసే హక్కు తన బోంట్లకు ఉండటం అని విశ్వనాథవారి భావం.

పూర్వం ఓ రాజు మీదికి మరో రాజు దండెత్తగా, ఈ రాజుగారి ఆస్థాన పురోహితుడు ఆవునెక్కి సైన్యాన్ని వెంటేసుకుని నిరాయుధంగా దండెత్తి వచ్చిన సైన్యం ముందుకు నడిపించేడుట. ఎగదీస్తే బ్రహ్మహత్య, దిగదీస్తే గోహత్య! ఎలాగురా అనుకుని ఆ భారతీయ హిట్లరు మర్యాదగా వెనుదిరిగి పోయేడుట!

సదరు పురోహితులవారి పవిత్రరక్తం ఈ కలికాలంలో తనొక్కడిలోనే ఉందనుకునే మహామహుడు విశ్వనాథ.

వీరిద్దరూ ఉత్తర దక్షిణ ధృవాలు.

అలాంటి ఇద్దరూ కలసి "తెలుగు మహాసభల్ని బహిష్కరించండి" అంటూ స్టేటుమెంటివ్వటం ఓ పెద్ద ప్రహసనం.

కాదు, ఉత్తర దక్షిణ ధృవాలు రెండూ ఒక్కలాగే ఉంటాయంటున్నారు, చూసినవాళ్ళు. కనుక మేమిద్దరం ఒక్కలాంటి వాళ్ళమే సార్! అంటున్నాడు శ్రీశ్రీ.

తనలో విదూషకుడి అంశ ఉందని చాలాకాలం క్రితం శ్రీశ్రీ రాసుకున్నాడు. దాన్ని రుజూ చేసుకునేందుకు

ఇంతకన్నా సదవకాశం దొరకలేదేమో! మహాకవి శ్రీశ్రీని చూసి, "అయ్యో పాపం, శ్రీశ్రీ!" అనుకోవాల్సి రావటం అన్యాయం, అని ఆయన ప్రియశిష్యుల బాధ.

శ్రీశ్రీ తాగుబోతు, తాగి మా ఇంటి కొచ్చాడు. ఈ నక్సలైటుగాడితో గొడవెందుకు లెమ్మని అడిగినట్టు స్టేటు మెంటు రాసిచ్చాను అంటారు కవిసామ్రాట్టు.

ఈయన్లో ఎంత హాస్యం ఉంది! అబ్బా! ఈయన స్టేటు మెంట్ చదువుతున్నంతసేపూ విరగబడి నవ్వలేక చచ్చాననుకోండి! అంటాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీ సంగతేమోగానీ ఈ స్టేట్ మెంట్లు తెలుగులో కాక ఇంగ్లీషులో వచ్చి ఉంటే మాత్రం "ఔరా! తెలుగులో మహాకవులు కూడా చక్కటి హాస్యం సృష్టిస్తారే! తెలుగు దినపత్రికలు పిచ్చోళ్ళ ప్రకటనలు కూడా బాక్సుకట్టి మరీ మొదటి పేజీల్లో వేస్తాయే! ఈ తెలుగువాళ్ళు చాలా పురోగమించిన జాతిసుమా అని ఆశ్చర్యపోక తప్పదు గదా! చదివే ఆ పరాయి భాషలవాళ్ళు!

(మే 1974)